## ధాం ''బింకం''

లాయర్ డాంబికరావు సార్థక నా మధేయుడు ప్రాక్టీస్ తక్కువ. ఫోజు ఎక్కువ. దీనివల్ల ఎప్పుడో పుట్టి మునుగుతుందని పెళ్ళాం విమర్శిస్తున్నా పట్టించుకోడు. డాంబికరావు ఆ పూట మహా బిజీగా వున్నాడు. హ వున్నట్లు కప్పిస్తున్నాడు ఆఫీస్ రూంలో. ఉదయం పది గంటలు కావస్తోంది. స్ప్రింగ్ డోర్ తెరుచుకుని ఒక యువకుడు వచ్చాడు గబగబా.

పుస్తకం సీరియస్‌గా చదువుతున్న లాయర్‌గారు ఆ కుర్రాణ్ణి కూచోమని సైగ చేసి పక్కనున్న ఫోనందుకున్నాడు. ఉపన్యాసం మొదలెట్టాడు. ఆ గంగా ప్రవాహం ఎంతకూ ఆగదే.

కుర్రవాడు వింతగా ఆయన వంకనే చూస్తున్నాడు.

ఫోనులో మొదటి ఘట్టం పూర్తిచేశాడు. మరో నెంబరుకు డయల్ చేశాడు. అవతలి వ్యక్తితో మరో ఉపన్యాసం ప్రారంభించాడు. నిమిషాలు గడుస్తున్నాయి భారంగా. ఆ కుర్రవానిలో సహనం సన్నగిలుతున్నా, ఏమనుకున్నాడో యేమో అలాగే నిలబడ్డాడు.

దాదాపు పది నిమిషాలు గడిచాయి.

డాంబికరావుగారు ఫోన్ పెట్టేశాడు. సగర్వంగా ఆ కుర్రవాని వంక తిరిగాడు.

''యస్. వాట్ కెన్ ఐ డూ ఫర్యూ'' అన్నాడు పోజుగా, గీరగా. తనెంత బిజీనో అతగాడి కర్థం అయి వుంటుందని.

''నేను టెలిఫోన్ డిపార్ట్‌మెంట్ నుంచి వస్తున్నానండీ '' ఫోన్ చెడిపోయిందని కబురెట్టారటగా. ఇక అవసరం లేదనుకుంటాను. బాగయినట్టుందిగా'' కొంటెగా అంటూ విసవిసా వెనక్కి నడిచాడు.

గుడ్లు తేలేశాడు లాయరుగారు కాలికింద పెట్టిన కాలింగ్ బెల్‌ను చూస్తూ ఒక్క తన్ను తన్నాడు కసిగా. ''తిక్క కుదిరింది'' కచ్చగా అన్నది లోపల్నుంచి బైటకు వచ్చిన లాయర్‌గారి అర్థాంగి.

-సుచంద్ర

## లెక్క

''మీరు నాకు రూ. 20 అప్పు ఇస్తానని చెప్పి, రూ. 10 మాత్రమే ఇచ్చారనుకోండి. అప్పు దేమవుతుంది?'' అని ఒక ఇల్లాలు భర్తను ప్రశ్నించి తనకు తనే సమాధానం చెప్పింది.

''మీకు నేను రూ. 10 బాకీ వుంటాను. నాకు మీరు 10 రూ.లు బాకీ వుంటారు. అప్పుడు ఎవరికి ఎవరూ బాకీ తీర్చాల్సిన అవసరం వుండదు అంతేగా!''

—బద్దిగం పాండురంగారెడ్డి,
(కరీంనగర్)

## పోట్లు తిప్పలు



-ఎస్. వేణుగోపాల్ కుమార్.
-సోమయాజుల సాయిప్రసాద్

ఆ దృశ్యం చూసిన కంపార్ట్‌మెంట్‌లో అందరూ చలించిపోయారు.

నోట్లో కండువా కుక్కుకుని నిశ్శబ్దంగా రోదిస్తున్న ముసలతని భుజం మీద చెయ్యి వేసి ఓదార్పుగా అన్నాడు మూర్తి ''ఊరుకోండి, పెద్దవారు మీరే ఇలా బెంబేలుపడిపోతే, ఆమె ఏమయిపోతుందో ఊహించారా? మీకు బాధగా వుంటుంది, నేను కాదనను కానీ, మీరే బెంగ పడిపోతే మరి ఆమెని ఓదార్చేదెవరు? లేవండి లేచి ఆ కన్నీళ్లు తుడుచుకోండి.''

''ఎలా ఊరుకోగలనండీ! ఒకటా? రెండా? అయిదువేలు పోయాయి! నా బాధ డబ్బు పోయిందని కాదు. నాకున్నదంతా ఊడ్చి ఒక్కగానొక్క పిల్ల పెళ్ళి చేశాను. దాన్ని ఒక అయ్య చేతిలో పెట్టానని తృప్తి పడ్డాను. కానీ ఆ ఆనందం, తృప్తి ఎంతోసేపు నిలవలేదు. నెల తర్వాత మా అల్లుడి అసలు రంగు బయటపడింది. అతడికి లేని వ్యసనమంటూ లేదు. పెళ్ళైన నెల నుంచీ వ్యసనాలకు కావలసిన డబ్బుల కోసం దీన్ని పుట్టింటికి పంపడం మొదలుపెట్టాడు. ఇది ఎదురు తిరిగితే గొడ్డును బాదినట్టు బాదేవాడు. అత్తింట్లో అది పడుతున్న బాధలు చూడలేక నా శక్తికి మించినదైనా అప్పుచేసి అతడడిగిన డబ్బు ఇస్తూ వుండేవాణ్ణి. కానీ మొన్నటికి మొన్న ఆఫీసు డబ్బుతో పేకాడాడు ఆ త్రాష్టుడు. ఆఫీసు డబ్బు కాజేశాడని మా అల్లుణ్ణి అరెస్ట్ చేశారు.

దిక్కు తోచక ''నాన్నా! ఇప్పుడు నేనేం చెయ్యాలి'' అంటూ భోరున ఏడుస్తూ వచ్చింది. మా అల్లుడిని విడిపించే ప్రయత్నాలు చేశాను. ఆఫీసు డబ్బులు అయిదువేలు కడితే జైలు నుంచి విడుదల చేస్తామని చెప్పారు. అందుకని నాలుగయిదు చోట్ల అప్పుచేసి. అయిదువేలు సంపాదించి తీసుకువెడుతున్నాను. కానీ, ఇలా ఆ డబ్బున్న సూట్‌కేసే పోతుందనుకోలేదు'' ఆపై ముసలతను మాట్లాడలేకపోయాడు. దుఃఖంతో అతడి గొంతు పూడుకుపోయింది.

''అయినా మీరు ఆ డబ్బున్న సూట్‌కేస్‌ను బెర్త్ మీద పెట్టకుండా వుండాల్సింది. అక్కడ పడుకున్న ఉంగరాల జుట్టతను సూట్‌కేస్ పట్టుకు దిగుతుంటే అతడి సూట్‌కేస్ అనుకున్నాను. అయినా పడుకోబోయే ముందు మీ డబ్బున్న సూట్‌కేస్ మీ దగ్గర పెట్టుకోవలసింది'' అన్నాడో సహ ప్రయాణీకుడు.

''మీరు చెప్పింది నిజమే! కానీ ఎదురు బెర్త్ మీదే



## డబుల్ మీనింగ్

జుట్టు పెరిగి పిరాగ్గా వుండడం చేత సెలూన్‌కి వెళ్ళాను.

వాడు టేప్ రికార్డర్ క్రొత్తగా కొన్నట్టున్నాడు. 'డిస్కో డాన్స్' పాటల కేసెట్ పెట్టాడు.

అతను నా తల వెనుక వైపు వున్న జుట్టును కత్తిరిస్తున్నాడు. నాకు ఆ భారీ మ్యూజిక్ తల నొప్పి కలిగించడం వల్లన 'కొంచెం తగ్గించమన్నా'ను. అదే నేను చేసిన పెద్ద తప్పు.

ఇప్పుడు అతను ముందువైపు జుట్టు కత్తిరించి, మీసాలు కత్తిరిస్తున్నాడు. అతను ఇంకా సౌండ్ తగ్గించ లేదేమిటా! అని మళ్లీ 'తగ్గించ'మన్నాను. ఇక వాడు తగ్గించకపోయేసరికి, పోనీలే అని ఊరుకున్నా.

నా ముఖం అద్దంలో చూసుకుందామని అద్దం ముందుకు వచ్చి నిలుచున్నాను. ఎవరో నా వెనుక నిల్చున్నారు. ఎవరా! అని వెనక్కి తిరిగి చూశాను. ఎవరో కాదు, ఆ శాల్తీ నేనే!

అతన్ని తిట్టి ప్రయోజనం లేదు. నేను తగ్గించమన్నది సౌండు. సెలూన్ వాడు అనుకున్నది జుట్టు.

నేను ఇంటికి వెళ్ళి 'అమ్మా!' అని పిలిచాను. కానీ మా అమ్మ రాలేదు. నా భార్యామణి వచ్చింది. ఒక గ్లాసుడు బియ్యంతో వచ్చింది. పిలిచింది ముష్టివాడను కొని. తరువాత ఏదేదో జరిగింది లెండి.

అప్పటి నుండి నేను సెలూన్‌కి వెళ్ళినప్పుడు ఒకొక్కమాట పరిశీలించి మరీ మాట్లాడతాను.

—ఆర్. హేమంత కుమార్



వున్నాను కదా అని ఊరుకున్నాను. అతడింత పని చేస్తాడనుకోలేదు'' బాధగా చెప్పాడు ముసలతను.

''శని తంతూ వుంటే అలాగే వుంటుంది మాస్టారూ!'' అన్నారు అంతవరకు సంభాషణంతా విన్న శాస్త్రిగారు నశ్యం పీలుస్తూ.

''జరిగినదానిని గూర్చి ఇప్పుడు బాధపడి ప్రయోజనం లేదు. ఇప్పుడేం చెయ్యాలో ఆలోచించాలి'' చెప్పాడు మూర్తి.

''ఏం చేస్తాం, ఏదైనా స్టేషన్ వస్తే పోలీస్ రిపోర్టిద్దాం.''

''సర్లెండి! పోలీస్ రిపోర్టిచ్చి,ఆ దొంగ దొరికేటప్పటికి వీళ్ళ అల్లుడి శిక్ష పూర్తయి జైలు నుంచి విడుదలై పోతాడు. అందుకని మనం కూడా పరిస్థితినర్థం చేసుకుని ఏదైనా సహాయం చేద్దాం.''

''ఏం సహాయం చెయ్యగలం- ఏదో ఒక అయిదో, పదో తప్ప!'' అన్నాడు శాస్త్రి.

''పోనీ అదే చేద్దాం! ఓ అయిదొందలైనా కూడితే ఎస్సై చేతిలో పెట్టి కేసు కోర్టుకి వెళ్ళకుండా ఆపు చేయించొచ్చు. ఈ లోపు అయిదువేలు దొరికితే ఆయన అల్లుణ్ణి విడిపించుకుంటాడు అన్నాడు సుందరం.

''ఇదిగో నా తరపు నుంచి ఓ పది రూపాయిలు'' అంటూ పది నోటందించాడు శాస్త్రి.

''నా తరపు నుంచి ఓ ఇరవై.''

''ఇదిగో ఓ పది రూపాయిలు.''

ముసలతని చేతులు అయిదు పది నోట్లతో నిండిపోయాయి.

అంతమంది సహృదయంతో చేస్తున్న సహాయానికి ముసలతని కనుకొలనుల్లో నీరు చిప్పిల్లింది. అతడూ, అతడి కూతురు చేతులెత్తి అందరికీ నమస్కరించారు.

ట్రైన్ తునిలో ఆగింది.

మరో మారు అందరికీ నమస్కరించి ట్రైన్ దిగారిద్దరూ. స్టేషన్ బయటికి వచ్చారు. వీరికోసమే ఎదురుచూస్తూ కూర్చున్నాడా ఉంగరాల జుట్టతను. ''హమ్మయ్య వచ్చారా! ఇదిగో మీ సూట్‌కేస్''- అందించాడు.

''మొత్తం తొమ్మిది వందల డెబ్బై కూడింది. నీ వాటా మూడు వందల ఇరవై ఇదిగో. మళ్ళీ రేపు దయం మద్రాస్ మెయిల్‌కి రా!'' చెప్పాడా ముసలతను డబ్బందిస్తూ.

''అలాగే'' అంటూ వెళ్ళిపోయాడతడు.

ముసలతను, కూతురూ తామాడిన (రోజువారీ) చిన్న నాటకంతో వచ్చిన డబ్బుని సంతృప్తిగా చూసుకుని కబుర్లు చెప్పుకుంటూ చీకట్లో కలిసిపోయారు.

*

## సతీ సావిత్రి

సావిత్రి, సత్యారావులు భార్యాభర్తలు.

సావిత్రి ఎంత గయ్యాళో, సత్యారావు అంత శాంత స్వభావుడు. సావిత్రికి భర్తంటే ఏ మాత్రం గౌరవం లేకపోగా, ఎప్పుడూ అతని మాట విన్న పాపన పోలేదు. అయినా సత్యారావు కిమ్మనకుండా కాపురాన్ని నడుపుకొస్తున్నాడు.

ఓ రోజు సాయంత్రం సత్యారావు ఆఫీసు నుంచి వచ్చేసరికి సావిత్రి ఇంట్లో లేదు. అసలే ఆఫీసులో అలసి పోయి ఇంటికొచ్చాడేమో విపరీతమైన ఆకలి, కోపంతో వున్నాడు.

ఇంతలో బయటికెళ్ళిన సావిత్రి రావడంతో యుద్ధం మొదలయ్యింది.

'ఇప్పటి వరకు ఎక్కడ తిరిగొచ్చావ్?' కోపంగా అడిగాడు సత్యారావు.

'సినిమాకి' నిర్లక్ష్యంగా సమాధానమిచ్చింది సావిత్రి.

మొన్ననే కదా సినిమాకెళ్ళావు. మళ్ళీ అప్పుడే సినిమా కావలసి వచ్చిందా నీకు?

''పక్కింటి బామ్మగారు తోడు రమ్మంటే ఏదో భక్తి సిన్మాకదా అని ''సతీ సావిత్రి'' సిన్మాకెళ్ళాను. ఇందులో తప్పేముంది'' ఎదురు ప్రశ్న వేసింది సావిత్రి.

''హు నీకు 'సతీ సావిత్రి' సినిమా కావల్సి వచ్చిందా? అందులో సావిత్రి తన భర్త పట్ల ఎలా ప్రవర్తించిందో చూశావు కదా! కనీసం ఆ మహా పతివ్రత పేరును పెట్టుకున్నందుకైనా నీలో ఆమె లక్షణాలు ఒక్కటీ లేవు'' దీర్ఘంగా నిట్టూర్చాడు సత్యారావు.

''మీరిప్పుడు అర్జెంటుగా చావండి. నేను యముడి దగ్గరికెళ్ళి మీ ప్రాణాలను కాపాడకపోతే అప్పుడడగండి.

అంతే! ఒక్కసారిగా నోరు తెరిచి కొయ్యబారి పోయాడు సత్యారావు. - శర్మ. సిహెచ్.

## పొట్టి ప్రసాద 'మాత్ర'!

డైలాగ్‌లున్న కాగితాలను ఇవ్వగానే పొట్టి ప్రసాద్ జేబులు తడువుకోసాగాడు.

''ఏమిటండీ వెతుక్కుంటున్నారు?'' అని అడిగాడు డైరెక్టరు.

''అబ్బే- ఏం లేదండి. ఇంత పొడుగాటి డైలాగ్‌లు వున్నప్పుడు- తడబడకుండా చెప్పేలా జ్ఞాపకశక్తిని వృద్ధిచేసే మాత్రను ఒక నాటు వైద్యుడు ఇచ్చాడు. దాన్ని ఎక్కడుంచానో జ్ఞాపకం రావడంలేదు'' అని పొట్టి ప్రసాద్ ఇంకా వెతుక్కుంటూనే వున్నాడు.

బద్దిగం పాండురంగారెడ్డి, (కరీంనగర్)

## నేను బతకొద్దా?



పొరిగింటి పుల్లయ్యకు ఒంట్లో బాగోలేక దాపులో వున్న ఒక పెద్ద బోర్డున్న పెద్ద డాక్టర్ దగ్గరి కెళ్ళాడు. డాక్టర్ గారు అన్ని పరీక్షలు జరిపి, చిత్రగుప్తుడి చిట్టా అంత పొడవు లిస్ట్ మందులు రాశాడు. పుల్లయ్య ఆ మందుల చీటీ తీసుకుని వెళ్ళి, పక్కనే వున్న మెడికల్ షాపులో అన్ని మందులూ కొన్నాడు. వెంటనే ఆ మందులన్నీ తీసుకెళ్ళి, ఓ మూలగా వున్న బావిలో పడేసి ఇంటికొస్తున్నాడు.

అదంతా గమనిస్తున్న ఎదురింటి ఎల్లయ్య అడిగాడు పుల్లయ్యని-

''డాక్టర్ దగ్గరికెళ్ళి, అంత ఫీజు కట్టి, అన్ని పరీక్షలు ఎందుకు చేయించుకున్నట్టు?''

''డాక్టర్ బతకొద్దా?'' అని సమాధానం చెప్పాడు పుల్లయ్య.

''అయితే ఆయన రాసిచ్చిన మందులన్నీ ఎందుకు కొన్నట్టు??'' అని అడిగాడు ఎల్లయ్య.

''మందుల షాపు వాడు బతకొద్దా?'' అని చెప్పాడు ఎల్లయ్య.

''మరయితే కొన్న మందులన్నీ బావిలో ఎందుకు పారేసినట్టు?'' మళ్ళీ అడిగాడు ఎల్లయ్య.

''నేను బతకొద్దా?'' అని చెప్పి, ఇంట్లోకి దూరి తలుపేసుకున్నాడు పుల్లయ్య.

అర్థమయిన ఎల్లయ్య ఆశ్చర్యపోయాడు!

—జయంపు కృష్ణ